


### అశ్వ రాజసం
గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి గుర్రపు పందాలు నిర్వహిస్తున్నారు. దీనికి వివిధ ప్రాంతాల నుంచి గుర్రాలను తీసుకువచ్చారు.

8లో



### జీడి పప్పు పరిశ్రమలకు హై ఓల్టేజీ
హైఓల్టేజీ కారణంగా సఖినేటిపల్లి మండలం మోరిపోడులో బుధవారం రాత్రి పలు జీడిపప్పు పరిశ్రమలకు నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో విలువైన జీడిపప్పు మాడిపోయింది.

### సాగుకు 8,900 క్యూసెక్కులు


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,200, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### వాడపల్లి క్షేత్రంలో ఘనంగా సదస్యం
మార్మోగిన గోవింద నామస్మరణ



వాడపల్లిలో స్వామివారికి ద్రవిడ వేద పారాయణ నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి చతుర్వేద పండితులతో ద్రవిడ వేద పారాయణ(మహాదాశీర్వచనం) అందజేశారు. స్వామివారికి డీసీ, ఈఓ చక్రధరరావు పట్టు వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఆభరణాలతో అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు మొక్కులు చెల్లించారు. శుక్రవారం గౌతమి గోదావరి నదిలో తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీసీ, ఈఓ చక్రధరరావు తెలిపారు.

### పెన్షనర్లకు ఐఆర్ ప్రకటించాలి



డీఐఈవో సోమశేఖరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పెన్షనర్లకు ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా శాఖ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సంఘ జిల్లా అధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. సరెండర్ లీవ్‌ను నగదుగా మార్చుకునే వీలు కల్పించాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లో హెల్త్ కార్డుపై అన్ని ఆస్పత్రుల్లో, అన్ని వ్యాధులకు వైద్యం అందేలా ఉత్తర్వులు జారీ చేయాలని సమావేశం సూచించింది. ఎయిడెడ్ విద్యా రంగంలో ఉద్యోగ విరమణ చేసిన అందరికీ రీయింబర్స్‌మెంట్ వర్తించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఐఈవో వనుము సోమశేఖరరావుకు సంఘ ప్రతినిధులు వినతిపత్రాన్ని అందించారు. సంఘ ప్రతినిధులు బి.చంద్రరావు, సీహెచ్ సత్యనారాయణ, అత్తిలి శ్రీనివాస్, పి.గోపాలకృష్ణ, బలభద్రశర్మ, ఈశ్వరీదేవి, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### లాభదాయకంగా డ్రోన్ టెక్నాలజీ : డీఆర్‌డీఏ పీడీ



ఎ.వేమవరప్పాడులో డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ తదితరులు

అమలాపురం రూరల్: వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాంకేతిక పరిజ్ఞానం లాభదాయకంగా ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ సాయినాథ్ జయచంద్ర గాంధీ అన్నారు. ఈ నెల 7 నుంచి 11 వరకు కర్నూలు ట్రిపుల్ ఐటీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ సాంకేతిక ప్రతినిధుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం క్షేత్ర స్థాయిలో డ్రోన్ల పనితీరును అమలాపురం మండలంలో ఏ.వేమవరప్పాడు వరి సాగు క్షేత్రాల్లో ప్రయోగాత్మకంగా చూపించారు. పురుగు మందులను సమర్థంగా పిచికారీ చేయడంలో డ్రోన్లు ఉపయోగపడతాయన్నారు. ఇది రైతులకు సురక్షితమైనదని, సమయం, ఖర్చును తగ్గిస్తుందన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్ ప్రతినిధి కృష్ణ నాయక్ మాట్లాడుతూ, పంటల మ్యాపింగ్, నేల విశ్లేషణ, వనరుల వినియోగాన్ని ఆప్టిమైజ్ చేయడంలోను, అపాయకర పనులను సురక్షితంగా చేయడంలో డ్రోన్లు ఉపయోగపడతాయన్నారు.

# గుల్ల వరం

- పి.గన్నవరాన్ని కొల్లగొడ్తున్న ఇసుకాసురులు
- అడ్డుకుంటున్నా.. బరి తెగించి మరీ తవ్వకాలు
- గతంలో అనుమతులు లేకున్నా ఆరు లంక గ్రామాల్లో దోపిడీ
- తాజాగా హైవే పనుల కోసం అనుమతులు
- అడ్డదారిలో లంక మట్టి తరలింపు
- కూటమి ప్రభుత్వంలో నిరాటంకంగా దందా



పి.గన్నవరం మండలం డీఎస్ పాలెంలో జనవరి తొలి వారంలో అనుమతుల్లేకుండా ఇసుక తవ్వకాలు

సాక్షి, అమలాపురం: గోదావరి మహోగ్రరూపం దాల్చి వరద పొంగి పొర్లితే జిల్లాలో మొదటగా ఏటిగట్లకు గండ్లు పడేది పి.గన్నవరం మండలంలోనే. 1986, 2006 వరదలకు ఇక్కడ గండ్లు పడి ఆస్తి, ప్రాణనష్టం సంభవించిన ఉదంతాలున్నాయి. గోదావరి నదీ ప్రవాహ ఉధృతికి 'నదీ కోత' అత్యధికంగా ఉండేది కూడా ఈ మండలంలోనే. కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జెడ్) ప్రాంతంలోకి వచ్చే లంక గ్రామాలు కూడా ఈ మండలంలో అధికం. ఇంత సున్నితమైన పి.గన్నవరం మండలంలోని పలు లంక గ్రామాల్లో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలకు ఒక లారీ, అనధికార అమ్మకాలకు తొమ్మిది లారీలు అన్నట్టుగా విక్రయిస్తూ.. ఇప్పటికీ గన్నవరంలో గోదావరిని గుల్ల చేస్తున్నారు. స్థానికంగా కీలక ప్రజాప్రతినిధి.. అతని అనుచరుల కనుసన్నల్లో ఈ మొత్తం దందా కొనసాగుతోంది.

**అవకాశం ఉంటే చాలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పి.గన్నవరం మండలం కేంద్రంగా ఇసుక, మట్టి అనే తేడా లేకుండా కొల్లగొట్టుకుపోతున్నారు. గతేడాది గోదావరిలో వరద ప్రభావం తగ్గిన తరువాత గత నవంబర్ నుంచి ఇష్టానుసారం ర్యాంపులు వేసి, ఇసుక, తువ్వ ఇసుక, గోదావరి మట్టి తవ్వకాలు చేశారు. గత ఎన్నికల్లో మిత్రుత్వం.. దోపిడీలో కూడా నిరాటంకంగా కొనసాగుతోంది. అక్రమ దందాలో కూడా జనసేన, టీడీపీ నాయకులు చెట్టాపట్టాలేసుకుని తవ్వకాలు సాగిస్తున్నారు. ఏటిగట్టుకు వాలు ఉండి, ఇసుక తవ్వకాలు చేసే అవకాశం ఉంటే చాలన్నట్టుగా ర్యాంపులు వేసి మరీ దోపిడీ చేస్తున్నారు.

**మండలం పరిధిలో ఉడిమూడి, ఎల్.గన్నవరం, యర్రంశెట్టివారిపాలెం, డీఎస్‌పాలెం, మానేపల్లి శివారు పెదకందాలపాలెంలో ఇసుక, మట్టి అక్రమ దందా పెద్దఎత్తున సాగింది. గోదావరిలో నిబంధనలకు విరుద్ధంగా మినీ డ్రెడ్జర్లు పెట్టి మరీ ఇసుక తవ్వకాలు సాగించారు. చివరకు పి.గన్నవరం ఆక్విడెక్టు** సమీపంలోనే ఇసుక తవ్వకాలు చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడం గమనార్హం. కీలక నేత, అతని అనుచరులు ఈ దందాను సాగించడంతో అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. స్థానికుల నుంచి ఒత్తిడి రావడంతో అడపాదడపా దాడుల చేసినా, తర్వాత చూసీచూడనట్టు వదిలేశారు. చివరకు ఉన్నతాధికారులపై కూడా జనసేనలో ఓ వర్గం ఫిర్యాదులకు సిద్ధం కావడంతో.. తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అయినా చాటుమాటున ఇసుక, మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

**అభివృద్ధి పనుల పేరుతో..**

తాజాగా జాతీయ రహదారులు, రైల్వే పనులు, జొన్నాడ ఫ్లై ఓవర్ నిర్మాణాలకు అవసరమైన తువ్వ మట్టి (తువ్వ ఇసుక)కు జిల్లా యంత్రాంగం అనుమతులు మంజూరు చేసింది. మానేపల్లిలంక, ఉడిమూడిలంకల్లో వీటి తవ్వకాలకు అనుమతులు ఇస్తారని తెలియగానే అక్రమార్కులు రంగప్రవేశం చేసి తవ్వకాలు మొదలు పెట్టారు. స్థానికులు పలు సందర్భాల్లో అడ్డుకున్నా, లెక్కలేనితనంతో తవ్వకాలు చేశారు. ఇప్పుడు అనుమతులు మంజూరు కాగా, అక్రమాలకు కొత్త మార్గాలు కనుగొన్నారు. అనుమతి పొందిన ప్రాంతంలోనే కాకుండా బాట వేసినంత లెక్క ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారు. అలాగే ఎంపిక చేసిన ప్రాంతాలకు ఒక లారీ మట్టి వెళుతుంటే, మరో తొమ్మిది లారీలు బయటకు వెళ్లిపోతున్నాయి.

**నదీ గర్భం మీదుగా బాటలు**

మానేపల్లిలంక నుంచి 1.25 ఎకరాల భూమిలో నేషనల్ హైవే పనుల కోసం మట్టిని తరలించేందుకు అనుమతి ఉండగా, పెద్ద కందాలపాలెం లంక నుంచి మానేపల్లి లంక వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర నదీ గర్భం మీదుగా బాటలు వేశారు. ఎడాపెడా ఉన్న తువ్వ మట్టిని దొడ్డిదారిన ఎత్తేస్తున్నారు. అలాగే ఉడుముడి లంక నుంచి ఆరు ఎకరాల్లో మట్టిని స్థానికంగా కడుతున్న వంతెన నిర్మాణాల అప్రోచ్‌కు, జొన్నాడ ఫ్లై ఓవర్ అప్రోచ్ పనుల కోసం మట్టి తీసేందుకు అనుమతించారు. దీని మాటున నియోజకవర్గ ప్రముఖ నేత అనుచరులు పెద్దఎత్తున మట్టిని తవ్వి ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ భూముల చదును చేసుకునే వారికి విక్రయిస్తున్నారు. ఇక్కడ ర్యాంపుల్లో రోజూ బారులు తీరుతున్న లారీలు చూస్తుంటే, ఇప్పటికే ప్రభుత్వం అనుమతిచ్చిన అభివృద్ధి కార్యక్రమాలకు సరిపడా ఇసుక తరలిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు. దొడ్డిదారిన రోజుకు సగటున 150 లారీల వరకు తువ్వ ఇసుక తరలిపోతోందని అంచనా. దూరాన్ని బట్టి లారీ మట్టికి రూ.8 వేల నుంచి రూ.13 వేల వరకు వసూలు చేస్తున్నారు.

**ముప్పు పొంచి ఉన్నా..!**

ఉడిమూడిలంక వద్ద నుంచి పెద్దఎత్తున లారీల నుంచి మట్టిని తరలించడం వల్ల స్థానికంగా ఉన్న గంటి పెదపూడి వంతెన దెబ్బతింటోందని స్థానికులు పలు సందర్భాలలో లారీలను అడ్డుకున్నారు. అధికార పార్టీ దన్ను ఉండడంతో తువ్వ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. అక్రమ తవ్వకాల విషయంలో కోస్టల్ రెగ్యులేజేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలు.. ఇరిగేషన్ శాఖలో ఉన్న 1986 మెద్రాస్ కన్జర్వెన్సీ యాక్టును అతిక్రమించి మరీ తవ్వకాలు చేస్తున్నారు. దీనివల్ల వశిష్ఠ, వైనతేయ నదులను గుల్ల చేస్తున్నారు. దీనివల్ల ఇప్పటికే అనేక లంక గ్రామాల్లో నదీ కోత తీవ్రత పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వరదల సమయాల్లో ఇక్కడ విపత్తు తీవ్రత మరింతగా పెరుగుతోందని కోనసీమ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల గంటి పెదపూడి వంతెన వద్ద లారీలను అడ్డుకున్న స్థానికులు



పి.గన్నవరం మండలం పెద కందాలపాలెం వద్ద బారులు తీరిన లారీలు

# జిల్లాలో ఐదు సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు

- పర్యావరణ అనుమతులు మంజూరు
- కార్యాచరణ రూపకల్పనకు అధికారులకు ఆదేశం
- 17న టెండర్ల ఆహ్వానం, 22న ఖరారు
- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులు వచ్చాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా త్వరలో ఇసుక తవ్వకాల నిర్వహణకు టెండర్లు ఖరారు చేసి, ఈ నెల 30 నాటికి తవ్వకాలు చేపట్టాలన్నారు. స్టాక్ యార్డులకు ఇసుకను తరలించి, నిల్వ చేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. వర్షా కాలంలో భవన నిర్మాణ రంగ అవసరాలకు సుమారు 13 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ యార్డ్‌లో నిల్వ చేయనున్నట్టు తెలిపారు. సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌ల నిర్వహణ కోసం కనీసం ఐదు పొరుగు జిల్లాల విధివిధానాలపై అధ్యయనం చేసి, ఈ నెల 16 నాటికి కార్యాచరణ సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. ప్రస్తుతం ఉన్న టాస్క్‌ఫోర్స్ బృందాలను బలోపేతం చేస్తూ, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను నిరోధించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సెమీ మెకనైజ్డ్ రీచ్‌ల కమిటీలో సభ్యులుగా ఉన్న డ్వామా పీడీ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, జల వనరుల శాఖ ఇంజినీర్, జిల్లా రిజిస్ట్రార్, జిల్లా ఆడిటర్లు ఈ రీచ్‌ల నిర్వహణ నిష్పక్షపాతంగా ఉండేలా విధివిధానాలు రూపొందించాలన్నారు. ఈ నెల 17న టెండర్లు పిలిచి, 22న ఖరారు చేస్తామని తెలిపారు. ఈ ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచుల్లో సుమారు 21 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించినట్లు చెప్పారు. కొత్తపేట, రావులపాలెం, కపిలేశ్వరపురం, అమలాపురంల్లో స్టాక్ యార్డులు ఏర్పాటు చేశారన్నారు.

**రెట్టింపు నిల్వలు**

గతేడాది కేవలం వర్షాకాలం సీజన్‌లో 6.25 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వ చేశారని, విస్తరిస్తున్న భవన నిర్మాణ రంగాన్ని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీనిని రెట్టింపు చేస్తూ 13 లక్షల నుంచి 14 లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉండేలా కార్యాచరణ సిద్ధం చేశామని వివరించారు. రావులపాలెం జాతీయ రహదారి-16కు దగ్గరగా 8 లక్షలు, అమలాపురం స్టాక్ యార్డ్‌లో 3 లక్షలు, తూర్పు డెల్టా గౌతమి ప్రాంతంలో 3 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వలు చేయనున్నట్లు తెలిపారు. స్టాక్ యార్డుల నిర్వహణపై అధ్యయనం చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ప్రతిరోజు సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ యార్డులకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం స్టాక్ యార్డుల్లో కేవలం 1.92 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలున్నాయని తెలిపారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, భూగర్భ గనుల శాఖ ఏడీ ఎల్.వంశీధర్ రెడ్డి, గోదావరి హెడ్ వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, ఆర్డీవో డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం, జీఎస్‌డబ్ల్యూఎస్ కో–ఆర్డినేటర్ సువిజయ్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.రాము తదితరులు పాల్గొన్నారు.

### క్లిష్ట సమస్యలపై నివేదికలు ఇవ్వాలి

అమలాపురం రూరల్: ప్రతి మండలంలో భూ పరిపాలన సాధారణ ఏడు అంశాలపై కాకుండా, క్లిష్ట సమస్యలపై నివేదికలు రూపొందించి తమకు సమర్పించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ బదిలీ, భూముల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ, ఈనాం భూములు, ఆర్ఓఆర్ వెబ్‌ల్యాండ్, రీసర్వే 22ఏ భూముల క్రమబద్ధీకరణ కాకుండా, సుదీర్ఘకాలంగా పరిష్కరించలేని క్లిష్ట సమస్యలను మాత్రమే సమర్పించాలని సూచించారు. నీటి తీరువా పూర్తి స్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. జేసీ టి.నిశాంతి మాట్లాడుతూ, ప్రతి మండలంలో భూ బదిలీ, క్రమబద్ధీకరణ తదితర నెలవారీ నివేదికలను ఆర్డీఓలకు సమర్పించాలని ఆదేశించారు. ఇలాఉండగా గ్రామాల్లో అసైన్డ్ భూముల్లో మూడేళ్ల వరకు కట్టడాలు లేకపోతే వాటిని ప్రభుత్వ అవసరాలకు తిరిగి తీసుకోవాలని సూచించారు. భూముల క్రమబద్ధీకరణ పథకానికి ఈ ఏడాది డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకుని హక్కులు పొందాలన్నారు. అభ్యంతరాల్లేని ప్రభుత్వ భూముల్లో గృహాలు, నివాస స్థలాలు కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డీఓలు కె.మాధవి, డి.అఖిల, పి.శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

### కట్టెల పొయ్యిపై వంటా!
ఆహార భద్రత కమిషన్ రాష్ట్ర సభ్యుడి ఆగ్రహం



గొలకోటివారిపాలెంలో పాఠశాలను తనిఖీ చేస్తున్న జక్కంపూడి

కొత్తపేట: పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంటా! ఇది కరెక్ట్ కాదంటూ ఆహార భద్రత కమిషన్ రాష్ట్ర సభ్యుడు జక్కంపూడి కిరణ్ స్థానిక గొలకోటివారిపాలెం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మోడేకుర్రు శివారు గోలకోటివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. భోజనాన్ని కట్టెల పొయ్యిపై వండటాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపటి నుంచి గ్యాస్ స్టౌపై వంట చేయాలని ఆదేశించారు. వంట చేసే పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, గోడలకు వైట్ వాష్ వేయాలని సూచించారు. ఆయన వెంట జేసీ నిషాంతి, డీఎస్ఓ ఉదయ్‌భాస్కర్, డీఈఓ ఎస్‌కే సలీమ్‌బాషా, ఇతర అధికారులు ఉన్నారు.

### ఇవే మాటలు టీడీపీ అంటే చట్టబద్ధమా?
వైఎస్సార్ సీపీ ఐటీ సెల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రాజా

అమలాపురం టౌన్: టీడీపీకి కొమ్ము కాస్తూ, చట్ట విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోపణలు చేస్తే, వాటిని ఆ పార్టీ వక్రీకరించి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజా విమర్శించారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో గురువారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీసులపై గతంలో టీడీపీ అగ్రనేతలైన చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు ఇవే మాటలు అంటే అప్పుడు చట్టబద్ధమయ్యాయా..? అని ప్రశ్నించారు. మొత్తం పోలీస్ వ్యవస్థపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపణలు చేయలేదని, కేవలం టీడీపీ ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేస్తున్న పోలీస్ అధికారులపైనే ఆరోపణలు చేశారన్న వాస్తవాన్ని ఆ పార్టీ అగ్రనేతలు గ్రహించాలని హితవు పలికారు. గతంలో పోలీసులను ఉద్దేశించి చంద్రబాబు 'చొక్కాలిప్పించి పరిగెత్తిస్తామని' ఓ సభలో అన్న మాటలను గౌతమ్‌రాజా ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### 13న కోనసీమ ఓపెన్ చెస్ టోర్నమెంట్

అమలాపురం రూరల్: ఆంధ్రా చెస్ అసోసియేషన్, కోనసీమ చెస్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన కోనసీమ డిస్ట్రిక్ట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు టోర్నీ కన్వీనర్ వి.శ్రీనుబాబు తెలిపారు. అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 9 నుంచి పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ నిర్వాహకులు కోరారు. వివరాలకు 97045 94846 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

# బెల్ట్.. ఫుల్లు

- బెల్ట్ షాపులు నిర్మూలించామన్న ఎక్సైజ్ మంత్రి
- జిల్లాలో ఎక్కడ చూసినా అవే..
- అధికారిక దుకాణాలు 171
- అంతకు మూడింతల బెల్ట్ షాపులు
- అధిక ధరలతో ప్రతి నెలా రూ.4.50 కోట్ల అక్రమార్జన



ఉప్పాడ పాత మార్కెట్ సమీపాన గాంధీ విగ్రహం వద్ద బెల్ట్ షాపు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'రాష్ట్రంలో మద్యం బెల్ట్ షాపులు దాదాపు నిర్మూలించాం. రూ.99కే క్వార్టర్ బాటిల్ మద్యం అందిస్తున్నాం. సారా రహిత రాష్ట్రంగా ఏపీని మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర గొప్పగా చెప్పారు. తిరుపతిలోని పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి సమావేశం అనంతరం మీడియా సమక్షంలో ఆయనన్న మాటలివి. ఎక్సైజ్ అధికారుల సమక్షంలో మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. జిల్లాలోని ఏ మారుమూల గ్రామంలో అడుగు పెట్టినా రెండు మూడు బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కానరావడం లేదు.

**అసలు 171.. కొసరు 500**

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం గుర్తించి, వేలం వేసిన మద్యం దుకాణాలు 171 ఉన్నాయి. ఇంతకు మూడింతలు పైబడి సుమారు 500 మద్యం బెల్ట్ షాపులు అనధికారికంగా నడుస్తున్నాయి. ఒక లైసెన్స్‌డ్ మద్యం దుకాణం పరిధిలో మూడు ఫుల్లు, నాలుగు ఆఫ్ అనే రీతిలో మూడు నాలుగు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రం కాకినాడతో పాటు సముద్ర తీర ప్రాంత మండలాలైన తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి, కోటనందూరు, కాకినాడ రూరల్‌తో పాటు మెట్ట ప్రాంతంలో బెల్ట్ షాపులకు అడ్డూ అదుపూ లేదు.

**రోజుకు రూ.కోటి**

జిల్లావ్యాప్తంగా 500 బెల్ట్‌షాపుల్లో రోజుకు సుమారు రూ.కోటి విలువైన మద్యం విక్రయాలు జరుగుతున్నట్టు అంచనా. అధిక ధరల దందాతో నేతల అక్రమార్జన రూ.15 లక్షలుంటుందని చెబుతున్నారు. నెలకు రూ.4.50 కోట్ల వరకూ కేవలం ధరల పెంపుతోనే కూటమి నేతలు అక్రమంగా ఆర్జిస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖలకు 10 శాతం అంటే రూ.45 లక్షలు పోను మిగిలిన రూ.3.90 కోట్లు నియోజకవర్గాల్లోని కూటమి ముఖ్య నేతల జేబుల్లోకి పోతోందనే ఆరోపణలున్నాయి.

**మహాత్మా మన్నించు**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ గ్రామంలో ఈ 'నిషా' సన్నివేశం నిత్యకృత్యం. పాత మార్కెట్ సమీపాన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం సాక్షిగా కూటమి నేతల దన్నుతో బరితెగించి మరీ బెల్ట్ షాపు నడుపుతున్నారు. అక్కడే మందుబాబులు తూలుతున్నా పట్టించుకునేవారే లేరు. కష్టజీవులు రోజంతా సంపాదిస్తున్న రూ.700లో మందుకు రూ.300పైనే ఖర్చయిపోతోంది. ఉప్పాడ, పొన్నాడ, కోనపాపపేట, శీలంవారిపాలెం, కొత్త మూలపేట, మూలపేట, అమీనాబాద్, శ్రీరామపురం, రమణక్కపేట, కొమరగిరి, నాగులాపల్లి గ్రామాల్లో కిళ్లీ కొట్లే మద్యం బెల్ట్ షాపులుగా మారిపోయాయి.

**కిళ్లీ కొట్లే బెల్ట్ షాపులు**

సామర్లకోట మండలం జి.మేడపాడులోని మద్యం షాపునకు అనుబంధంగా పెదబ్రహ్మదేవం గ్రామంలో సుమారు 12 బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ప్రతి కిళ్లీ కొట్టూ ఒక బెల్ట్ షాపుగా మారిపోతోంది. ఒక్కో బెల్ట్ షాపులో రూ.50 వేలకు మించి అమ్మకాలు జరుగుతున్నాయన్నది అంచనా. బెల్ట్‌షాపులు లేకుండా చేస్తామని ప్రకటనలు చేసిన చంద్రబాబు నాయుడు వీటిపై ఒక్కసారి దృష్టి సారించాలి.

### కూటమి నేతల కనుసన్నల్లో..

- తుని నియోజకవర్గం తొండంగి, కోటనందూరు మండలాల్లో స్థానిక టీడీపీ నేతల కనుసన్నల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ, దండిగా అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతల అనుచరులు ఈ బెల్ట్ షాపులు నడుపుతూండగా, నీకు సగం – నాకు సగం అంటూ పంపకాలు వేసుకున్నారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఐటీడీఏ ఉప ప్రణాళికా ప్రాంతంలో ఉన్న రౌతులపూడి, శంఖవరం మండలాల్లోని ప్రతి గ్రామంలోనూ ఒక బెల్ట్ షాపును అక్కడి టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలే నిర్వహిస్తున్నారు.
- జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లో సైతం టీడీపీకి చెందిన మండల స్థాయి ముఖ్య నేతల అనుచరులు బెల్ట్ షాపులు నడుపుతున్నారు.
- పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో కూడా దాదాపు ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సామర్లకోట మండలంలోని ఒక్క మాధవపట్నం గ్రామంలోనే 10కి పైనే బెల్ట్ షాపులున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. బెల్ట్‌షాపులతో జీవనోపాధి కోల్పోతున్నామని ఇటీవల ఆ గ్రామంలోని కల్లుగీత కార్మిక కుటుంబాలు పెద్దాపురం ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఇంటికి వెళ్లి మొర పెట్టుకోవడం గమనార్హం.
- స్మార్ట్ సిటీ కాకినాడలోని ఏటిమొగ, జగన్నాథపురం, సంజయ్ నగర్, రేచెర్లపేట, సాంబమూర్తి నగర్‌లలో కిళ్లీ కొట్లలోనే బహిరంగంగానే బెల్ట్ షాపులు నడుపుతున్నారు.

## క్లుప్తంగా

### రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


రైలు పట్టాల వద్ద పడి ఉన్న మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ: అదుపుతప్పి రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతిచెందినట్టు రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై మావుళ్లు గురువారం తెలిపారు. ద్వారపూడి–కడియం రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు చెప్పారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్టు తెలిపారు. మృతుడు నీలం రంగు ప్యాంటు, పసుపు రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడని చెప్పారు. టాటానగర్ నుంచి పాలక్కడ్‌కు జనరల్ టికెట్ ఉందన్నారు. వివరాలు తెలిస్తే 94406 27551, 94910 03239 నంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

### వడదెబ్బకు వ్యక్తి మృతి


లక్ష్మణరావు (ఫైల్)

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరానికి చెందిన నాయీ బ్రాహ్మణుడు సంధిపర్తి లక్ష్మణరావు(50) గురువారం వడ దెబ్బకు గురై మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బాజాభజంత్రీలు వాయిస్తుండగా, లక్ష్మణరావు ఆకస్మికంగా కుప్పకూలాడు. స్థానికులు అతడిని పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

### పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

ప్రత్తిపాడు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని వంచించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు గురువారం అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగికి చెందిన వి.గన్నిబాబు అదే మండలంలోని మరో గ్రామానికి చెందిన యువతిని ప్రేమించానని నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతో ఆమె ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### 16లోగా అభ్యంతరాలు, గ్రీవెన్స్ సమర్పించాలి

అమలాపురం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, పూర్వ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందుకు గత నెలలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి ఎం.పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు దరఖాస్తుల పరిశీలన అనంతరం htpp://artgodavari.nic.in వెబ్‌సైట్‌లో ప్రావిజనల్ లిస్ట్ పొందుపర్చినట్టు చెప్పారు. ఈ జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11 నుంచి 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా కొవ్వూరు ఆస్పత్రి ఆవరణలోని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో సమర్పించాలని కోరారు. అభ్యంతరాలు, గ్రీవెన్స్ పరిశీలన తర్వాత ఫైనల్ మెరిట్ లిస్ట్ వెబ్‌సైట్‌లో ఉంచుతామని తెలిపారు.

# అశ్వ రాజసం

- పదేళ్ల తర్వాత.. గుర్రపు పందాలు
- చేబ్రోలులో నేటి మధ్యాహ్నం ప్రారంభం
- వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పెంపకందారులు
- ఆదరణ తగ్గిందని ఆవేదన

పిఠాపురం: పౌరాణిక చిత్రాల్లో ఎన్టీఆర్, ఏఎన్నార్, కత్తి కాంతారావు లాంటి మహా నటులు మొదలు.. ఆ తర్వాత వచ్చిన చిత్రాలు 'కొండవీటి దొంగ'లో చిరంజీవి, 'టక్కరి దొంగ'లో మహేష్‌బాబు, 'మగధీర'లో రాంచరణ్, 'బాహుబలి'లో ప్రభాస్, తాజాగా 'డాకు మహరాజ్'లో బాలకృష్ణ వంటి హీరోలు గుర్రపు స్వారీ చేస్తుంటే.. చూసే అభిమానులకు రెండు కళ్లూ చాలవు. హీరోలు, పెహల్వాన్లే కాదు, గుర్రాలను మేమూ దౌడు తీయిస్తామంటున్నారు హార్స్ రైడర్లు. ఇటీవల కాలంలో గుర్రపు స్వారీలు బాగా పెరిగాయి. గుర్రపు స్వారీలో శిక్షణ ఇచ్చే కేంద్రాలూ వెలిశాయి. వీటికంటే పందాల్లో పాల్గొనే గుర్రాల పెంపకం చాలా కాలం నుంచీ ఉంది. గతంలో ప్రాంతలకతీతంగా గుర్రపు పందాలు జరుగుతుండేవి. ఈమధ్య కాలంలో గుర్రపు పందాలు చాలా వరకూ తగ్గిపోయాయి. అధిక ఖర్చుతో కూడుకున్న పందాలు కావడంతో.. వీటిని నిర్వహించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. జిల్లాలో పదేళ్ల తర్వాత గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గుర్రపు పందాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి పందెపు గుర్రాలు చేబ్రోలుకు చేరాయి. మూడు రోజులుగా వీటిని ఇక్కడకు చేర్చిన యజమానులు.. పందెం బరిలో వాటికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలకు ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 20 గుర్రాల వరకు చేరాయి. పోటీల సమయానికి మరో పది గుర్రాలు రావచ్చని నిర్వాహకులు చెబుతున్నారు.


ఇలా మసాజ్ చేయకపోతే పరుగు ఇబ్బందే..

**నటన కాదు.. పరుగులెత్తించాలి**

సాధారణంగా సినిమాల్లో హీరోలు చేసే హార్స్ రైడింగ్ చాలా సున్నితంగా ఉంటుంది. ఎడిటింగ్‌లో వేగంగా వెళ్లినట్టు చూపిస్తుంటారు. పందాల్లో అలా కాదు. గుర్రాల సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. అందుకే పందాల్లో పాల్గొనే గుర్రాలకు ప్రత్యేక మేతతో పాటు, శిక్షణ ఉంటుంది. వేగానికి చిహ్నంగా నిలిచే గుర్రం పూర్వం నుంచి తన ఉనికిని చాటుకుంటోంది. సాధారణ గుర్రాలు రూ.50 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు విలువ ఉండగా, మేలు జాతి గుర్రాలైతే రూ.10 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఖరీదైనవి ఉన్నాయి. మేలు జాతి గుర్రాలకు గిరాకీ ఎక్కువ. వాటిని కొనడం ఓ ఎత్తయితే.. పోషించడం మరో ఎత్తు. ఒక్కో గుర్రం పెంపకానికి నెలకు సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతుందని పెంపకందారులు చెబుతున్నారు.


చేబ్రోలు చేరుకుంటున్న గుర్రాలు


చేబ్రోలు గుర్రపు పందాల్లో ఆకర్షణగా నిలిచిన డాకు మహారాజ్ సినిమాలోని గుర్రం (అసలు పేరు రేకట్. ప్రస్తుతం డాకు మహరాజ్)

### ప్రాచీన కళకు జీవం పోయాలని..



కొన్నేళ్లుగా గుర్రపు పందాల నిర్వహణకు సమన్వయం చేస్తుంటాను. అందుకే నాకు గుర్రాల చిన్న అనే పేరు వచ్చింది. గుర్రపు పందాలు ఎంతో ప్రాచీనమైనవి. రాను రాను వీటి ఉనికి దెబ్బతింటోంది. గుర్రపు పందాలు వినోదమే కాదు, వీటి వల్ల అనేక మూగ జీవాలైన గుర్రాలు సంరక్షించబడతాయి. అందుకే పందాలు గుర్రాల ఉనికిని చాటుతున్నాయి. రాష్ట్రంలో విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ తదితర ప్రాంతాల్లో గుర్రాల పెంపకం పెరిగింది. ఎక్కడ పందాలు జరిగినా అందరూ తమ గుర్రాలను తీసుకొస్తుంటారు. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న క్రీడ. నిర్వాహకులు, గుర్రాల పెంపకందారులు ఖర్చుకు వెనుకాడరు. పందాల్లో పాల్గొనే గుర్రాలకు చేసే సపర్యలు అంతాఇంతా కాదు. వీటికి ప్రత్యేక ఖరీదైన దాణాతో పాటు, మసాజ్‌లు చేయాలి. గెలిస్తే వచ్చేది పేరు తప్ప ఏమీ ఉండదు. కానీ ఆ గెలుపు కోసం నెలల తరబడి గుర్రాలను రూ.లక్షలు ఖర్చు పెట్టి పోషిస్తుంటారు. ఎప్పుడో ఓసారి పందాలకు వెళ్లి గుర్రం అలిసిపోతుంది మినహా, రోజూ వాటిని పోషించడానికి రౌతు ప్రతి రోజూ అలిసిపోతాడు. గుర్రపు స్వారీ చేయడం వల్ల వచ్చే ఆరోగ్యం చాలా ఎక్కువ. దానికోసం ఇప్పుడు గుర్రపు స్వారీ శిక్షణా కేంద్రాలు వెలిశాయి. చాలా ఏళ్ల తర్వాత గుర్రపు పందాలు జరగడం ఆనందంగా ఉంది.

– గుర్రాల చిన్న, పెద్దాపురం

# గంటలో బాలిక ఆచూకీ లభ్యం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


కుతుకులూరులో బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై శ్రీనునాయక్

పెదపూడి: అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో నాలుగో తరగతి విద్యార్థిని అదృశ్యం సంఘటన కలకలం రేపగా, గంట వ్యవధిలో పోలీసులు ఆ బాలికను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. అనపర్తి ఎస్సై శ్రీనునాయక్ తెలిపిన వివరాల మేరకు, కుతుకులూరు గ్రామంలో లంక సత్యనారాయణ కుమార్తె షర్మిల రామవరం ఎంపీపీ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం టిఫిన్ తెచ్చుకోడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుమంత్ సూచనలతో రంగంలోకి దిగిన అనపర్తి ఎస్సై శ్రీనునాయక్, అదనపు ఎస్సై దుర్గాప్రసాద్ తమ సిబ్బంది బాలిక కోసం గాలింపు చేపట్టారు. గంట వ్యవధిలోనే కుతుకులూరు గ్రామంలో ఓ చోట బాలికను పోలీసులు కనుగొన్నారు. ఈ సంఘటనపై బాలికను పోలీసులు వివరాలు అడగ్గా, బాగా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించినందుకు వెళ్లిపోయినట్టు చెప్పిందని ఎస్సై తెలిపారు. వెంటనే స్పందించి, బాలిక ఆచూకీని కనుగొన్న పోలీసులను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

# మహిళపై టీడీపీ మాజీ కౌన్సిలర్ దాడి

రక్షణ కల్పించాలని డీఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు


అమలాపురం టౌన్: తమ ఇంట్లో అద్దెకుంటున్న వ్యక్తిపై గొడవకు వచ్చిన అమలాపురానికి చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ, అతని అనుచరులు తనపై ఇనుప రాడ్లతో దాడి చేసి, గాయపరిచారని స్థానిక నల్లవంతెన రజకపేటకు చెందిన టీకి వెంకటలక్ష్మి డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం దీనిపై ఆమె ఫిర్యాదు చేయడమే కాకుండా, తనకు దున్నాల దుర్గ నుంచి రక్షణ కల్పించాలని డీఎస్పీని కోరారు. ఈ నెల 3న రాత్రి పది గంటల ప్రాంతంలో తన ఇంట్లో అద్దెకుంటున్న తోలేటి ఓంప్రకాష్ ఎక్కడ అంటూ తనపై దాడి చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, రాజకీయ పలుకుబడితో మాజీ కౌన్సిలర్‌ను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె వివరించారు. తనపై దాడి చేసిన దున్నాల దుర్గతో పాటు, దున్నాల దిలీప్, కంచిపల్లి శ్రీను, జక్కపు ప్రసాద్, ఏలూరి అయ్యప్పపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. ఆమెకు సంఘీభావాన్ని తెలిపిన వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణతో కలిసి బాధితురాలు డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.


డీఎస్పీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకటలక్ష్మి

# జీడి పప్పు పరిశ్రమలకు హై ఓల్టేజీ

- మాడిపోయిన సరకు
- కాలిపోయిన పరికరాలు

మలికిపురం/సఖినేటిపల్లి: హైఓల్టేజీ కారణంగా సఖినేటిపల్లి మండలం మోరిపోడులో బుధవారం రాత్రి పలు జీడిపప్పు పరిశ్రమలకు నష్టం వాటిల్లింది. దీని ప్రభావంతో విలువైన జీడిపప్పు మాడిపోయింది. అలాగే విలువైన విద్యుత్ పరికరాలు, జీడిపప్పు డ్రయ్యర్ మెషీన్లు దెబ్బతిన్నాయి. గ్రామంలోని ముప్పర్తి సుబ్బారావు పరిశ్రమతో పాటు, మరికొన్ని పరిశ్రమల్లో భారీ నష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు. జీడి పప్పు ప్రాసెసింగ్ కోసం డ్రయ్యర్ మెషీన్లలో ఉంచగా, తెల్లవారుజామున అటుగా జీడి పప్పు డ్రమ్ముల వద్దకు వెళ్లిన కార్మికులు హైఓల్టేజీని గమనించడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే కార్మికులు మెయిన్ స్విచాఫ్ చేసి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. లేకపోతే మరింత నష్టం వాటిల్లేదని సుబ్బారావు తెలిపారు. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని వ్యాపార వర్గాలు తెలిపాయి. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం దెబ్బతిన్న పరిశ్రమలను పరిశీలించారు. హైఓల్టేజీకి కారణాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.


హైఓల్టేజీకి మోరిపోడులో మాడిపోయిన జీడి పప్పు


దెబ్బతిన్న డ్రయ్యర్ మెషీన్

# తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

25 కాసుల బంగారం, నగదు అపహరణ


దొంగలు కొల్లగొట్టిన బీరువా

నిడదవోలు: తాళం పగులగొట్టి పట్టపగలే ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన సంఘటన పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, స్థానిక దానమ్మగుడి వెనుక వీధిలోని రెండంతస్తుల భవనం కింది పోర్షన్‌లో పెట్రోల్ బంక్ ఉద్యోగి బలిజ సత్యనారాయణ నివసిస్తున్నారు. ఈయన కుమార్తె ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఉదయం పిల్లలతో సహా అందరూ వెళ్లిపోయారు. ఇంటికి తాళం వేసి సత్యనారాయణ కూడా బయటకు వెళ్లారు. మధ్యాహ్నం 2.30 సమయంలో ఆయన ఇంటికి తిరిగొచ్చారు. దొంగలు ఇంటికి వేసిన తాళాన్ని కట్టర్‌తో కట్ చేసి, ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా లాకర్‌ను కూడా కట్ చేసి, 35 కాసుల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదు, కొంత వెండిని అపహరించారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పండ్ల వ్యాపారి తండ్రి కిడ్నాప్


సుబ్బారావు కుమారుడు శ్రీరామ్ రమేష్


కిడ్నాప్ గురైన మురళీహర సుబ్బారావు (ఫైల్)

రావులపాలెం: ఆర్థిక లావాదేవీల కోసం పండ్ల వ్యాపారంలో తమతో భాగస్వామి అయిన వ్యక్తి తన తండ్రిని కిడ్నాప్ చేశాడని రావులపాలేనికి చెందిన శిరగం శ్రీరామ్ రమేష్ స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. వివరాలివీ.. రావులపాలెంలో ఓ లాడ్జి, జ్యూస్ సెంటర్ నిర్వాహకుడైన శిరగం శ్రీరామ్ రమేష్ నాలుగేళ్లుగా మహారాష్ట్ర జిల్లా సాంగ్లీ ప్రాంతానికి చెందిన సంజుతో కలిసి పండ్ల తోటల వ్యాపారం చేస్తున్నాడు. సంజు మహారాష్ట్రలో పండ్ల తోటలు కొని పెడుతూ, మధ్యవర్తిత్వం చేస్తూంటాడు. ఈ క్రమంలో రమేష్ తండ్రి శిరగం మురళీహర సుబ్బారావు ద్రాక్ష తోటల కొనుగోలు కోసం తరచూ మహారాష్ట్ర వెళ్లి వస్తున్నాడు. ఇటీవల ఓ లోడుకు సంబంధించి రూ.15 లక్షలు బాకీ పడడంతో రమేష్, సంజు మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో సంజు మనుషులు రావులపాలెం వచ్చి మూడు రోజులుగా రెక్కీ నిర్వహించారు. బుధవారం రాత్రి ఇంటికి వెళ్తున్న సుబ్బారావును స్థానిక ఆదిలక్ష్మీ నగర్ ఐదో వీధిలోని వారి ఇంటి సమీపంలో కారు ఎక్కించుకుని, మహారాష్ట్ర తీసుకెళ్లారు. తండ్రి ఇంటికి రాకపోవడంతో వెతుక్కుంటూ వెళ్లిన రమేష్‌కు తండ్రి స్కూటీ, చెప్పులు ఇంటి సమీపంలోని వీధిలో కనిపించాయి. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా గాలించగా, అర్ధరాత్రి ఇంటికి వస్తున్న తన తండ్రిని నలుగురు వ్యక్తులు కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంజు మనుషులు తనను మహారాష్ట్ర తీసుకు వెళుతున్నట్లు తండ్రి సుబ్బారావు గురువారం ఉదయం ఫోనులో చెప్పాడని పోలీసులకు శ్రీరామ్ రమేష్ తెలిపాడు. తన వద్ద గతంలో పని చేసి మానేసిన గంటి గ్రామానికి చెందిన రుద్ర సురేష్ కిడ్నాపర్లకు సహకరించాడని, మూడు రోజులుగా రావులపాలెంలో వారిని తిప్పాడని ఆరోపిస్తూ అతడిని పోలీసులకు అప్పగించాడు. కారులో నలుగురు రాగా వారిలో సంజయ్, రమేష్, గోపయ్య, మరో వ్యక్తి ఉన్నారని పోలీసు విచారణలో రుద్ర సురేష్ చెప్పాడు. తన తండ్రి సుబ్బారావు ఇంటికి ఫోను చేసి, 'మీరు మహారాష్ట్ర వస్తున్నారా?' అని అడుగుతున్నాడని శ్రీరామ్ రమేష్ పోలీసులకు తెలిపాడు. రమేష్ ఫిర్యాదు మేరకు ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రావులపాలెం అదనపు ఎస్సై కేవీ రమణారెడ్డి తెలిపారు.



# ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి


తిరగబడిన ట్రాక్టర్‌ను తీస్తున్న పొక్లెయిన్


సిద్ద వెంకటేశ్వరరావు (ఫైల్)

సీతానగరం: ఇటుక బట్టీలో మట్టిని తొక్కుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మండలంలోని రఘుదేవపురానికి చెందిన సిద్ద వెంకటేశ్వరరావు(45) మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు, ఎప్పటిలాగే గురువారం ఉదయం వెంకటేశ్వరరావు స్థానిక రవీంద్ర కాలనీలోని తన ఇటుక బట్టీ వద్దకు వెళ్లాడు. ఇటుకల తయారీ కోసం మట్టిని ట్రాక్టర్‌తో తొక్కుతుండగా, అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ క్రమంలో వెంకటేశ్వరరావు అదే మట్టిలో కూరుకుపోయాడు. బట్టీ వద్ద ఉన్నవారు పొక్లెయిన్ సాయంతో ట్రాక్టర్‌ను తొలగించి, వెంకటేశ్వరరావును బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానిక బస్టాండ్ సెంటర్ వద్దనున్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి మృతితో భార్య దుర్గాభవాని, తల్లి సత్యవతి, వివాహాలైన కుమార్తెలు కోటేశ్వరి, సంధ్యారాణి భోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీను తెలిపారు.

### 24 వేసవి ప్రత్యేక రైళ్లు



రాజమహేంద్రవరం సిటీ: వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తూర్పుగోదావరి జిల్లా మీదుగా ఈ నెల 11 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతి శుక్ర, శనివారాల్లో ప్రత్యేక రైళ్లు నడిపేందుకు చర్యలు చేపట్టినట్టు రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్డు(07025) రైలు ప్రతి శుక్రవారం, శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి(07026) ప్రతి శనివారం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ రైళ్లు జిల్లాలోని రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వే స్టేషన్లలో ఆగుతాయని చెప్పారు. అలాగే తిరుపతి–షిరిడీ సాయి నగర్ మధ్య నడిచే ప్రత్యేక రైళ్ల(07637/38)ను జూన్ 30వ తేదీ వరకు పొడిగించినట్టు తెలిపారు.

# ఎదురెదురుగా ఢీకొన్న లారీ, వ్యాన్

ఇద్దరు డ్రైవర్లకు గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్

తాళ్లరేవు: జాతీయ రహదారి–216లోని పి.మల్లవరం జంక్షన్ సమీపంలో ఐస్ ఫ్యాక్టరీ వద్ద గురువారం తెల్లవారుజామున లారీ, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయా వాహనాల డ్రైవర్లకు గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ వివరాల మేరకు, అంబాజీపేట నుంచి శ్రీకాకుళానికి కొబ్బరిడొక్కల లోడుతో వెళుతున్న వ్యాన్, రావులపాలెం నుంచి బీహార్ వెళుతున్న చేపల లోడు లారీ తెల్లవారుజాము సమయంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆత్రేయపురం గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ కోటి వరప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా, కృష్ణా జిల్లా గుడ్లవల్లేరుకు చెందిన లారీ డ్రైవర్ జుజ్జువరపు రవితేజకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

# మద్యం మత్తులో రత్నగిరికి ప్రయాణం

నలుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

అన్నవరం: రత్నగిరి ఘాట్ రోడ్‌లోని టోల్‌గేట్ వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో.. మద్యం తాగి ఉన్న నలుగురిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే, బుధవారం రాత్రి పది గంటల సమయంలో నలుగురు వ్యక్తులు కారులో రత్నగిరికి వెళ్లేందుకు టోల్‌గేట్ వద్దకొచ్చి టోల్ చార్జీ చెల్లించారు. ఆ కారును తనిఖీ చేసేందుకు సెక్యూరిటీ సిబ్బంది ప్రయత్నించగా వారు వేగంగా వెళ్లిపోయారు. సెక్యూరిటీ సిబ్బంది ఆ కారును వెంబడించి, ఘాట్ రోడ్ మధ్యలో అడ్డుకున్నారు. కారును తనిఖీ చేయగా, డ్రైవర్ సహా, నలుగురు మద్యం సేవించి ఉన్నట్టు బ్రీత్ అనలైజర్‌లో తేలింది. కారులో మద్యం సీసాలు ఉన్నాయి. వారిని వెనక్కి పంపేందుకు ప్రయత్నించగా, సిబ్బందితో వారు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సెక్యూరిటీ గార్డులు వారిని పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. వారిపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపర్చారు.

### 108 అంబులెన్స్‌కు సుస్తీ..

ప్రత్తిపాడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మానస పుత్రికగా పేరొందిన 108కి సుస్తీ చేసింది. ఫోన్ చేయగానే కుయ్.. కుయ్ మంటూ వచ్చే 108 వాహనానికి అవస్థలు వచ్చిపడ్డాయి. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని 108 వాహనం సాంకేతిక లోపంతో తరచూ స్టార్ట్ కానంటూ మొండికేస్తోంది. గతేడాది నవంబర్ నుంచి మరమ్మతుల కోసం ఎదురుచూస్తూనే ఉంది. సిబ్బంది చిన్న మరమ్మతులు చేయడం, బండి బయలుదేరడం అన్నట్టు సాగిపోతోంది. 108కు ఎవరైనా కాల్ చేస్తే.. ఆగమేఘాలపై వెళ్లాల్సిన అపర సంజీవనికి 'స్టారింగ్' కష్టాలు లొచ్చాయి. ఎవరైనా బండిని నెట్టుతారా అంటూ ఎదురుచూడడం నిత్యకృత్యమైంది. ఎప్పటిలాగే గురువారం బండి స్టార్ట్ కాకపోవడంతో ఇలా.. తలో చేయి వేస్తున్నారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద 108ను తోస్తున్న స్థానికులు